నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 6 డిసెంబర్ 2024 | SIDDIPET

హైడ్రా కమిషనర్‌ను కలిసిన బాధితులు

హైడ్రా కమిషనర్‌ను సన్మానిస్తున్న అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితుల జేఏసీ సభ్యులు

అమీన్‌పూర్, డిసెంబర్ 5: సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు పైభాగంలో ఇండ్లు, ప్లాట్లు కోల్పోయిన ముంపు బాధితుల అసోసియేషన్ సభ్యులు బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు కమిషనర్ రంగనాథ్‌తో మాట్లాడారు. ఈనెల తొమ్మిదో తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో హైదరాబాద్ చెరువులపై రివ్యూ మీటింగ్ ఉన్నదని, ఆ మీటింగ్‌లో సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ముంపు బాధితుల అసోసియేషన్ సభ్యులు కమిషనర్ రంగనాథ్‌ను సన్మానించారు. ముంపు బాధితుల జేఏసీ చైర్మన్ చిరునామా సత్యనారాయణ, సభ్యులు నాగభూషణరావు, సుబ్రహ్మణ్యం, విజయకుమార్ వీర్, మహమ్మద్, సత్యమూర్తి, రమేశ్, రామారావు ఉన్నారు.

సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రాష్ట్రంలో నిరంకుశ పాలన

సిద్దిపేటలో రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేటలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- మాకు ఉద్యమాలు కొత్త కాదు
- అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదు
- ఖాకీలు, తాటాకు చప్పళ్లకు భయపడం
- సిద్దిపేటలో బీఆర్ఎస్ శ్రేణుల మండిపాటు
- రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

సిద్దిపేట, డిసెంబర్ 5: ప్రశ్నించే గొంతులను నొక్కడమే ఎజెండాగా పెట్టుకొని రాష్ట్రంలో ప్రభుత్వం నిరంకుశ పాలన కొనసాగిస్తున్నదని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల సాయిరామ్, మెహన్‌లాల్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి ఆరోపించారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కమాన్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు గుండు భూపేశ్, కాముని శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ కనుకరాజుతో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇది ప్రజాస్వామ్యమా... నిర్బంధకాండనా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేసినందుకు అతడి ఇంటికి వెళ్తే హరీశ్‌రావును అక్రమంగా అరెస్ట్ చేసి గచ్చిబౌలి పీఎస్‌కు తరలించడం సిగ్గుచేటన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేపై ఉల్టా కేసు పెట్టడం దారుణమన్నారు. అక్రమ అరెస్టుల వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యమా.. నిరంకుశ పాలనా అని ప్రశ్నించారు. ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టినందుకే మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆగస్టు15న నాటిని పూర్తి పంటరుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్టు పెట్టిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఎమ్మెల్యేకు అండగా వెళ్లిన హరీశ్‌రావును అరెస్టు చేయడం దారుణమన్నారు. హరీశ్‌రావు జోలికి వచ్చినవారు కాలగర్భంలో కలిసిపోయారన్నారు. పాలన పక్కదారి పట్టించి రేవంత్‌రెడ్డి పోలీస్ రాజ్యాన్ని నడుపుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్లు అవినీతి అని ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకూ పోరాటం చేస్తామన్నారు. ఖాకీలకు, తాటాకు చప్పళ్లకు ఎవరూ భయపడరని..ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి అని హెచ్చరించారు. సమావేశంలో సోమిరెడ్డి, ఎల్లారెడ్డి, రామచందర్ రావు,ప్రభాకర్ వర్మ, కనుకరాజు, రవీందర్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, సుందర్, అరవిందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఎల్లయ్య, శ్రీకాంత్,రెడ్డి యాదగిరి పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అడిగితే అక్రమ అరెస్టులా..?

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, డిసెంబర్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడితే ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులాగా మారుతారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అక్రమ అరెస్టుకు నిరసనగా మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అమలు గురించి అడిగితే ప్రభుత్వం అక్రమ అరెస్ట్‌లు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రశ్నించే గొంతుకలను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజాసమస్యలపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పోరాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్ట్‌లకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లోనే అక్రమ అరెస్టులు జరుగుతున్నాయన్నారు. లగచర్ల, మూసీ బాధితులు బీఆర్ఎస్‌ను ఆశ్రయించి వారి సమస్యలను మొరపెట్టుకుంటున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం చెప్పినట్లు పోలీసులు వినకుండా న్యాయం, ధర్మం వైపు ఉండాలని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులకు స్టేషన్ బెయిల్ ఇచ్చి బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఫెండ్లీ పోలీస్‌వ్యవస్థ ఉండేదని, నేడు పోలీసులు ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు కొట్టివేసి తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సంతోష్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు చంద్రశేఖర్, రమణాగౌడ్, మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

హరీశ్‌రావు అరెస్టుపై ఆగ్రహం

- గచ్చిబౌలి పీఎస్ ఎదుట బీఆర్ఎస్ కార్పొరేటర్ నిరసన
- నిరసనకారులను అరెస్టు చేసిన పోలీసులు

గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పటాన్‌చెరు, డిసెంబర్ 5: సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ అరెస్టుపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సైబరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి పీఎస్ ఎదుట బీఆర్ఎస్ నేతల నిరసనలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సోమిరెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు పృథ్వీ పాల్గొన్నారు. హరీశ్‌రావును ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ బలగాలు వచ్చి బైఠాయించిన నేతలను బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించారు. అనంతరం గచ్చిబౌలి పీఎస్ వద్ద బీఆర్ఎస్ నాయకుడు మెట్టు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ అప్రజాస్వామికంగా హరీశ్‌రావును అరెస్టు చేశారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో పోలీస్‌రాజ్యం నడుస్తున్నదని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వారిని అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

హరీశ్‌రావును ఎదుర్కోలేకనే అరెస్టు

నారాయణఖేడ్, డిసెంబర్ 5: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును రాజకీయంగా ఎదుర్కోలేకనే సీఎం రేవంత్‌రెడ్డి అక్రమ అరెస్టుకు కుట్ర చేశాడని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆరోపించారు. గురువారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీల విషయమై ఈనెల 9 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తారనే భయంతోనే హరీశ్‌రావును అరెస్టు చేశారన్నారు. ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టి జైలులో ఉంచినా బీఆర్ఎస్ నాయకులు కడిగినా ముత్యంలా బయటకు వస్తారన్నారు. గులాబీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు కోసం పోరాటాలు చేయడమే కాదు, ప్రాణం ఇవ్వడానికి సైతం సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి సొంత గ్రామంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తన సూసైడ్ నోట్‌లో రేవంత్‌రెడ్డి సోదరుల పేర్లు రాసి ఆత్మహత్యకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేయని పోలీసులు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తూ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులపై వేధింపులు ఆపకపోతే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, నాయకులు ఎంఏ నజీబ్, రవీందర్‌నాయక్, పరశురామ్, ముజామిల్, అభిషేక్‌శెట్కార్, విఠల్‌రావు, వెంకటేశం, రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

హుస్నాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు (ఇన్‌సెట్‌లో) సిద్దిపేట కలెక్టర్ వాహనం ట్రాఫిక్‌లో నిలిచిపోవడంతో క్లియర్ చేస్తున్న తహసీల్దార్

హుస్నాబాద్, డిసెంబర్ 5: మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అక్కన్నపేట చౌరస్తాలో గురువారం బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ అక్రమంగా నాయకులను అరెస్ట్ చేస్తోందన్నారు. ప్రభుత్వం అక్రమ అరెస్టులను నిలిపివేయడంతోపాటు హరీశ్‌రావును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న, ఎడబోయిన తిరుపతిరెడ్డి, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, ఎం డీ అన్వర్, వాల నవీన్, బొజ్జ హరీశ్, బొల్లి శ్రీనివాస్, పరశురాములు, గద్దల రమేశ్, మ్యాక నారాయణ, బత్తుల జగ్జీవన్, నాయకులు పాల్గొన్నారు.

ధర్నాతో నిలిచిపోయిన కలెక్టర్ వాహనం

అక్కన్నపేట చౌరస్తాలో బీఆర్ఎస్ నేతలు రాస్తారోకో చేస్తుండగా నాగారం రోడ్డు నుంచి వెళ్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, ఆర్డీవో రామ్మూర్తి వాహనాలు 20 నిమిషాల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. వాహనంలోనే కలెక్టర్, ఆర్డీవోలు ఉన్నారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం చేశారు.

గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో హరీశ్‌రావుకు సంఘీభావం తెలుపుతున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

- హరీశ్‌రావు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 5: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అరెస్టును సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. గురువారం హైదరాబాద్‌లో హరీశ్‌రావును అరెస్టు చేసి గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌తో కలిసి ఆయన హరీశ్‌రావును కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్బంధ పాలనపై మండిపడ్డారు. రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతున్నదని ఎద్దేవా చేశారు. ప్రజాకోర్టులో శిక్షతప్పదని హెచ్చరించారు. పోలీసులు పనితీరు మార్చుకోవాలని, కాంగ్రెస్ నేతలకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ అయిందని విమర్శించారు. సీఎం ఆదేశాలతోనే పోలీసులు తప్పులు చేస్తున్నారని, పార్టీలను అణచివేసే ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి శాశ్వతం కాదని, ఆయన పతనం మొదలైందని జోస్యం చెప్పారు. వెయ్యి మంది రేవంత్‌రెడ్డిలు ఒక్కటైనా బీఆర్ఎస్‌ను ఏమీచేయలేరన్నారు. బీఆర్ఎస్‌ను ఎంత అణచివేయాలని చూస్తే అంత తిరుగుబాటు వస్తుందని ఎమ్మెల్యే హెచ్చరించారు.

నల్లవల్లికి చెందిన చాపల కళావతి

రేషన్‌కార్డు లింక్‌తో పంట రుణమాఫీ కాలే

గుమ్మడిదల, డిసెంబర్ 5: పాసుబుక్ ఆధారంగా పంట రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు కొత్తగా రేషన్ కార్డు లింక్ పెట్టడం వల్ల మాకు కాలేదని మండలంలోని నల్లవల్లికి చెందిన రైతులు చాపల మధు, చాపల కళావతి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు మాట్లాడారు. చాపల కళావతికి ఎకరం 27 గుంటలు, చాపల మధుకు నాలుగు ఎకరాల భూమి ఉన్నది. కళావతి రూ.55 వేలు, కుమారుడు చాపల మధు రూ.లక్ష 74 వేల పంట రుణం తీసుకున్నారు. గుమ్మడిదల మండలంలో నల్లవల్లి, కొత్తపల్లి, ఫ్యారాగనర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు నార్సాపూర్ బ్యాంకు ద్వారా, గుమ్మడిదల వ్యవసాయశాఖ అధికారుల సూచన మేరకు వీరు పంట రుణం తీసుకున్నారు. పాసుబుక్ ఆధారంగా పంట రుణమాఫీ అవుతుందని అనుకున్న వీరికి కొత్తట్విస్ట్ వచ్చింది. రుణం తీసుకుంది నర్సాపూర్ బ్యాంకు, వ్యవసాయశాఖ గుమ్మడిదల మండలం కావడంతో పంట రుణమాఫీ కోసం నర్సాపూర్ బ్యాంకుకు వెళ్తే గుమ్మడిదల వ్యవసాయ శాఖకు వెళ్లాలని చెబుతున్నారు. గుమ్మడిదల వ్యవసాయ శాఖకు వెళ్తే నర్సాపూర్ బ్యాంకు వారిని కలువాలని చెబుతున్నారు. కాగా తల్లీ కొడుకుకు కలిపి ఒకే రేషన్ కార్డు ఉన్నది.

నల్లవల్లికి చెందిన చాపల మధు

'గురుకులం'లో సమస్యల తిష్ట

గిర్మాపూర్ గురుకులంలో నాచు పట్టిన నీటి ట్యాంకులు

గిర్మాపూర్ గురుకులంలో అపరిశుభ్రంగా వంట గది

- అగమ్యగోచరంగా గురుకులాల పరిస్థితి
- సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్ గురుకులంలో రాజ్యమేలుతున్న సమస్యలు
- ఇటీవల పాఠశాలను సందర్శించిన బీఆర్ఎస్‌వీ నాయకులు
- విద్యార్థుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

కొండాపూర్, డిసెంబర్ 5: తెలంగాణలో గురుకులాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోజూ ఏదో ఒక గురుకుల పాఠశాల, కళాశాలల్లో సమస్యలపై విద్యార్థులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గిర్మాపూర్ గురుకుల పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అధికారులు వచ్చి పాఠశాలను సందర్శించి వెళ్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. విద్యార్థులు ఉండే గదుల్లో కరెంట్ బోర్డులు, కిటికీలు కూడా సరిగ్గా లేవు. మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. ఆరు బయట విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నా వారి పక్కనే కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ వ్యాప్తంగా గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం వడ్డించే వారు. గురుకులాల పరిసరాలు కూడా శుభ్రంగా ఉండేవి. కానీ, ప్రస్తుతం అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల విద్యార్థులకు పురుగుల అన్నం, నీళ్లచారు వడ్డించారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. విద్యార్థులు ఉండే ప్రాంతంలో చెత్తాచెదారం, నీటి సమస్యలు నెలకొన్నాయి. వంట గదుల్లో వాడే పరికరాలు, బాతురూమ్‌లు కూడా దుర్వాసనతో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం, జిల్లా స్థాయి అధికారులు స్పందించి పరిష్కరించాలని బీఆర్ఎస్‌వీ నాయకులు కోరుతున్నారు.

కిటికీ తలుపులు లేకుండా హాస్టల్ గది

ముద్దగా భోజనం, చెత్తాచెదారంతో పరిసరాలు, కరెంటు బోర్డు దుస్థితి

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఉపాధి

సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్, డిసెంబర్ 5: విద్యార్థి దశ నుంచే నైపుణ్య అభివృద్ధి శిక్షణ తీసుకోవడం ద్వారా సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి సూచించారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడారు. హుస్నాబాద్ ప్రాంతంలోని యువతకు ఐటీ రంగంలో ఉద్యోగాలు వచ్చేలా శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్‌లోని టీ హబ్‌లోని సైన్‌హబ్ ప్రతినిధులచే డిగ్రీ కళాశాలలో 100 మంది, పాలిటెక్నిక్ కళాశాలలో 50మంది విద్యార్థులకు పైలెట్ ప్రాజెక్టులో భాగంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కమ్యూనికేషన్, టెక్నికల్, ప్రాబ్లమ్స్ సాల్వ్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తిగా ఉచితంగా ఉంటుందని, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఆరు నెలల పాటు ఇచ్చే ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిత్యం కళాశాలకు రావడంతో పాటు విషయాలపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, ప్రిన్సిపాల్స్ భిక్షపతి, అశోక్, సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధర నిర్ణయించి

పరిహారం చెల్లించాలి

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులతో కలిసి మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబర్ 5: రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులకు మార్కెట్ ధర నిర్ణయించి పరిహారం చెల్లించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన రైతులు ఆయన్ని కలిసిన సందర్భంగా మాట్లాడారు. న్యాయపరమైన పరిహారం దక్కేవరకు బీఆర్ఎస్ మీ వెంటే ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓట్లు దండుకోవడానికి ట్రిపుల్‌ఆర్ బాధితులకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మాట మార్చుతున్నారని మండిపడ్డారు. రైతులను మభ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని, అధికారులు, పోలీసులతో బెదిరిస్తూ భూములు లాక్కుంటామని చెప్పడం సిగ్గుచేటన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్‌ఆర్‌ఆర్ మారుస్తామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. ఎకరాకు ఏడునుంచి ఎనిమిది లక్షలు ఇస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, మార్కెట్ ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలోని మాసాయిపేట, తూప్రాన్, వర్గల్, గజ్వేల్, మార్కుక్, జగదేవ్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల మీదుగా ఆర్‌ఆర్ వెళ్తుండటంతో రైతులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాదాసు శ్రీనివాస్, విరాసత్ అలీ, చంద్రశేఖర్, సాయిలు, హన్మంతరెడ్డి, బాలమల్లు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.